నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 6 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

కొనసాగుతున్న ఏఈవోల నిరసన

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 5 : వ్యవసాయశాఖ పరిధిలోని విస్తరణ అధికారుల నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే ప్రతి మంగళవారం రైతువేదికల్లో జరిగే రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో సైతం ఏఈవోలు తమ నిరసన కొనసాగించారు. రైతువేదికలో జరిగిన రైతునేస్తం కార్యక్రమంకు హాజరైన అధికారులు మరోమారు రాష్ట్ర ఉన్నత అధికారులకు తెలిసే విధంగా నిరసన వ్యక్తంచేశారు. గడిచిన 45రోజులుగా ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ వారు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వారి సూచనలు పట్టించుకోకపోగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో పనిచేస్తున్న 58మంది ఏఈవోలపై సస్పెన్షన్ వేటువేసిన సంగతి తెలిసిందే. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రాప్ డిజిటల్ సర్వే చేయాలని ఒప్పందం ప్రకారంగా మూడురోజులు సర్వే చేసినప్పటికీ నేటివరకు మరోమారు వారిని సర్కార్ చర్చలకు ఆహ్వానించకపోవడంతో నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. సస్పెన్షన్ చేసిన ఏఈవోలను తక్షణమే విధుల్లోకి చేర్చుకోవాలని, ఏఈవోల సమస్యలపై వ్యవసాయశాఖ మంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు.

మధిర రైతువేదికలో నల్లబ్యాడ్జీలు ధరించి, నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు

- ప్రకటనలకే పరిమితమవుతున్న జిల్లా మంత్రులు
- సీసీఐ కొర్రీలతోనే ప్రైవేట్‌కు రైతుల పంట
- వ్యవసాయ మార్కెట్ల సందర్శనలో బీఆర్ఎస్ నేతలు
- ఖమ్మంలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి: తాతా
- క్వింటా పత్తికి రూ.వెయ్యి బోనస్ ప్రకటించాలి: సండ్ర
- బీఆర్ఎస్ నాయకుల ఎదుట దూది రైతుల కంటతడి

ప్రభుత్వ తీరుతోనే.. పత్తి రైతుల కుదేలు

ఖమ్మం, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో పత్తి రైతులు కుదేలవుతున్నారని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు విమర్శించారు. ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల కారణంగా దూదిపూల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్సీ తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ తదితరులు కలిసి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తియార్డులో క్రయవిక్రయాలను మంగళవారం పరిశీలించారు. గడిచిన వారం రోజుల నుంచి వానకాలం సీజన్‌లో సాగు చేసిన పంటను రైతులు ఖమ్మం మార్కెట్‌కు భారీగా తీసుకొస్తున్నారు. ఈ సంవత్సరం భారత పత్తి సంస్థ (సీసీఐ) జిల్లా వ్యాప్తంగా తొమ్మిది జిన్నింగ్ మిల్లులను సీసీఐ కేంద్రాలుగా గుర్తించినప్పటికీ వాటిల్లో కేవలం నాలుగు కేంద్రాల్లో మాత్రమే నామమాత్రంగా పంటను కొనుగోలు చేస్తోంది. దీనికితోడు దిగుబడులు పూర్తిగా పడిపోవడం, మార్కెట్లో మద్దతు ధర లేకపోవడం వంటి కారణాలతో కర్షకులు ఆగమాగమవుతున్నారు. అలాంటి రైతులకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ నేతలు మంగళవారం ఉదయం 9 గంటలకే ఏఎంసీకి వచ్చారు. అక్కడి పత్తి రైతులు వారికి ఘన స్వాగతం పలికారు. తమ పంటను వారికి చూపించి తమ బాధలు చెప్పుకునేందుకు బారులు తీరారు. కొందరు రైతులు తమ గోడు వెళ్లబోసుకుంటూ కంటతడి పెట్టారు. ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండాకు చెందిన మాళోత్ కాళీదాసు అనే రైతు తన బాధ చెప్పుకున్నాడు. తాను దాదాపుగా 40 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తిసాగు చేశానని, తీరా పంటను మార్కెట్‌కు తెస్తే క్వింటాకు రూ.6,500 మించి ఖరీదు దారులు ధర పెట్టడం లేదని వాపోయాడు. రఘునాథపాలెం మండలం మంగ్యాతండాకు చెందిన యువ రైతు బానోత్ రవి కూడా తన గోడు వెళ్లబోసుకున్నాడు. తాను 14బస్తాల పంటను తెస్తే కనీసం పంటను చూసేందుకు ఒక్క వ్యాపారి కూడా రావడం లేదని కన్నీరుపెట్టుకున్నాడు. ఇలా దాదాపు రెండుగంటల పాటు నాయకులు ప్రతి రైతు వద్దకూ వెళ్లి పేరుపేరునా వారిని పలుకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. రైతులకు ఎల్లవేళలా బీఆర్ఎస్ అండగా ఉంటుందని, మద్దతు ధర వచ్చే వరకు పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు.



పత్తి యార్డులో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న తాతా మధు, సండ్ర, బీఆర్ఎస్ నేతలు

సీసీఐ, ఏఎంసీ అధికారుల తీరుపై ఆగ్రహం

రైతులు ఇబ్బందులు ఎదుర్కోవడంలో సీసీఐ, ఏఎంసీ అధికారులు పాత్ర కూడా ఉందని, తద్వారా రైతులు మద్దతు ధర పొందలేకపోతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఎదుటనే అధికారుల తీరును తప్పుబట్టారు. పంటను తెచ్చిన రైతులకు మద్దతు ధర అందుతుందా? లేదా? అని ఏ ఒక్క అధికారీ ఆరా తీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

ఖమ్మం, నవంబర్ 5: జిల్లాలో పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య, లింగాల కమల్‌రాజు, ఆర్‌జేసీ కృష్ణ తదితరులు మాట్లాడుతూ.. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వారు తమ పంటను సరైన ధరకు అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, అకాల వర్షాలు, ఇతర వైపరీత్యాల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సౌకర్యార్థం గతంలో మాదిరిగా ఏఎంసీలో సబ్సిడీ క్యాంటీన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరిస్తున్న తాతా మధు, సండ్ర, లింగాల తదితరులు

ఏఎంసీలోనే సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి

విలేకరుల సమావేశంలో తాతా మధు, సండ్ర

గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని తాతా మధు ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధరల విషయంలో జిల్లాలోని ముగ్గురు మంత్రులు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. సీసీఐ కొర్రీలతో రైతుల పంట మొత్తం ప్రైవేటుకు వెళ్తోందని ఆరోపించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. పత్తి రైతులకు క్వింటాకు రూ.వెయ్యి చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పంటను తీసుకొచ్చిన ప్రతి రైతూ కన్నీళ్లు పెడుతుంటే ఎంతో బాధ కలుగుతోందని అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పెద్ద రైతులు ఉండి కూడా రైతుల బాధలను పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఆర్‌జేసీ కృష్ణ మాట్లాడుతూ.. కేవలం దళారుల పంట కొనుగోలు చేసేందుకు మాత్రమే సీసీఐ కేంద్రాలను దూరంగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఒకవైపు పత్తి రైతుల బాధలు ఇలా ఉంటే ఒక్క రోజులోనే వేలాది రూపాయల ధర తగ్గించి మిర్చి వ్యాపారులు సైతం ఆ రైతుల రెక్కల కష్టాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు, రైతు సంఘం నాయకులు బెల్లం వేణు, వీరూనాయక్, ఉన్నం బ్రహ్మయ్య, హరిప్రసాద్, పసుమర్తి రామ్మోహన్, తోట వీరభద్రం, పగడాల నరేందర్, ఎర్రా అప్పారావు, మాటేటి నాగేశ్వరరావు, మాటేటి కిరణ్, బండి సతీశ్, ఉప్పుగుండ్ల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పత్తి యార్డు ఎదుట రైతు సంఘం ధర్నా

- క్వింటా పత్తికి రూ.5 వేలకు మించి ధర పెట్టకపోవడంపై ఆగ్రహం
- ఖమ్మం ఏఎంసీలో కాంటాలను అడ్డుకొని.. యార్డుకు తాళాలు
- దళారుల చేతిలో ఏఎంసీ బందీ : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపణ

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 5 : పత్తికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.5,721 ఉండగా.. రూ.5 వేలకు మించి ధర పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీపీఐ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి యార్డు ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత పత్తి మార్కెట్‌లోకి వాహనాలు వెళ్లకుండా ఆందోళన చేపట్టారు. అనంతరం యార్డులో కాంటాలను అడ్డుకోవడంతోపాటు పత్తి యార్డు కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ పత్తి మార్కెట్‌లో దళారుల దందాతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారని, వారి చేతిలో మార్కెట్ బందీ అయ్యిందని, సీసీఐ కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. మార్కెట్లో నేటి వరకు ప్రైవేట్ వ్యాపారులు 5,200 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేయగా, సీసీఐ అధికారులు కేవలం 178 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారన్నారు. పత్తి ఎక్కువగా పండించే ప్రాంతాల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని అయన ప్రశ్నించారు. మార్కెట్‌లో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయని పక్షంలో కొనుగోళ్లను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం గిట్టుబాటు ధర కల్పిస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మార్కెట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌కు రైతుల సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు మహ్మద్ మౌలాన, జితేందర్‌రెడ్డి, ఎర్రా బాబు, దొండపాటి రమేశ్, గోవిందరావు, సీతామహాలక్ష్మి, కళావతి, రామ్మూర్తి, శ్రీనివాసరావు, వీరభద్రం, పుచ్చకాయల సుధాకర్, రవి, సాంబశివరెడ్డి, శశిధర్ పాల్గొన్నారు.

ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

రేవంత్ పాలనలో అన్నీ మోసాలే..

ఎన్డీ నాయకుడు ఆవునూరి మధు

కారేపల్లిలోని సీసీఐ కొనుగోలు కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

కారేపల్లి, నవంబర్ 5 : ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు అన్ని విధాల మోసపోతున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు అవునూరి మధు ఆరోపించారు. మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం ఆ పార్టీ మండల కార్యదర్శి వై.ప్రకాశ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నా.. వాటి వల్ల రైతులకు ఎటువంటి లాభం కలగడం లేదన్నారు. రైతులు విక్రయానికి తీసుకొచ్చే పత్తిని ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని, వారికి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు పేర్ని వెంకటేశ్వర్లు, చింత రజిని, నర్సింహారావు, మస్తాన్, రవికుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్రమోహన్
- 2 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంగా 323 కొనుగోలు కేంద్రాలు

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

ఖమ్మం, నవంబర్ 5 : జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని రాష్ట్ర గనులశాఖ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్రమోహన్ అన్నారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం చేపట్టిన చర్యల వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా సురేంద్రమోహన్ మాట్లాడుతూ సన్నరకం ధాన్యం కింద ఏ ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశం రైతులకు స్పష్టంగా తెలిసేలా ప్రచారం ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దొడ్డు వడ్లు, సన్న వడ్లకు తేడాను స్పష్టంగా తెలియజేసేలా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు క్షేత్రస్థాయి సిబ్బంది శిక్షణ అందించాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద తాలు పేరుతో కోతలు పెట్టవద్దన్నారు. సన్నరకం ధాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ తెలంగాణ రైతులకు మాత్రమే అందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎటువంటి ధాన్యం వస్తుందని అంచనాతో 165 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం మద్దతు ధరకు సంబంధించిన గోడపత్రికను సురేంద్రమోహన్ ఆవిష్కరించారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన తదితలు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి కె.సురేంద్రమోహన్

ధాన్యం రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల(1.3 లక్షల సన్న రకం, 70 వేల దొడ్డు రకం) ధాన్యం కొనుగోలు అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని, గతంలో ఖమ్మం జిల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉంటే ప్రస్తుతం 323 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో డీసీఎంఎస్ ద్వారా 27, డీఆర్డీఏ ద్వారా 138, పీఏసీఎస్ ద్వారా 158 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు అందుబాటులో పెట్టామన్నారు. 1077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ట్రైనీ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీమ్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.శ్రీలత, అదనపు డీఆర్డీవో నూరొద్దీన్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది ఉండొద్దు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : వానకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వీ పాటిల్‌తో కలిసి మాట్లాడారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ, శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు, కొలతలు రవాణా, మార్కెటింగ్‌శాఖ అధికారులు రైస్‌మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వానకాలం సీజన్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చివరి గింజ వరకు నాణ్యమైన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో డబ్బులు చెల్లించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,95,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

చుంచుపల్లి, నవంబర్ 5 : మండలంలోని పెనగడప గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెనగడప కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్, సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు పాల్గొన్నారు.

శాఖల సమన్వయంతో విద్యుత్ సౌకర్యం

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

సమావేశంలో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, నవంబర్ 5 : మారుమూల గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు రైతుల పంట భూముల్లో అటవీ, విద్యుత్ శాఖల సమన్వయం, సహకారంతో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. అటవీ, విద్యుత్ శాఖ అధికారులతో ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పోడు పట్టా కలిగిన రైతుల వ్యవసాయ భూముల్లో విద్యుత్ మోటర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన రైతుల వ్యవసాయ భూములకు ఆర్‌వోఎఫ్ఆర్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించడానికి దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నిష్ణాతులైన ఫారెస్టు, విద్యుత్ సిబ్బందిని పంపించి పకడ్బందీగా సర్వే చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏపీవో డేవిడ్ రాజ్, డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఏపీవో(పవర్) ఏఈ మునీర్‌పాషా, ఎఫ్ఆర్వోలు, డీఎఫ్‌వోలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మట్టి ఇళ్లే ఆరోగ్యానికి మేలు

- పొరుగు రాష్ట్రాల్లో మట్టి కట్టడాలే ఎక్కువ..
- ఇంటి నిర్మాణ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, నవంబర్ 5 : రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు ఎలా సాధిస్తారో.. ఆరోగ్యంగా పది కాలాలపాటు జీవించాలంటే సహజంగా లభ్యమయ్యే మట్టితో మనం అందంగా బొమ్మరిల్లు వంటి ఇంటిని నిర్మించుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో వైటీసీలో మట్టితో సాంప్రదాయ కట్టడాలు, గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఖర్చు, పర్యావరణానికి అనుకూలంగా మంచి మన్నిక కలిగిన నిర్మాణాలపై రమ్మెడ్ ఎర్త్ ఫౌండేషన్, సీఎస్‌బీ పద్ధతులతో అవసరమైన ఇంటి నిర్మాణాల శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలతోపాటు ఇంటి నిర్మాణాలు కూడా తక్కువ పెట్టుబడితో పర్యావరణానికి హాని కలిగించకుండా మట్టితో అందమైన గృహాలు నిర్మించుకుని వాటిలో జీవిస్తే ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. ఇళ్లు, మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా.. ప్రతీది ఇష్టమైన రీతిలో నిర్మించుకోవచ్చని, వీటికి ఖర్చు కూడా ఎక్కువగా ఉండదన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో ఎక్కువగా మట్టితో కట్టిన ఇళ్లే దర్శనమిస్తాయన్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే సిమెంటు, ఇసుకను తగ్గించి.. సహజంగా లభ్యమయ్యే మట్టి, రాళ్లు కలిపి సమపాళ్లలో ఇటుకలు తయారు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం ఇటుకలు ఏ విధంగా తయారు చేయాలో ప్రయోగాత్మకంగా శిక్షకులు తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విద్యాచందన, ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్, జేడీఎం హరికృష్ణ, శిక్షకుడు సుధాకర్, ఏఈలు, డీఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

మట్టి ఇటుకల శిక్షణ తయారీని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

విద్యుత్ మీటర్ ఎన్‌వోసీ కోసం రూ.20 వేలు డిమాండ్

లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 5 : విద్యుత్ మీటర్ ఎన్‌వోసీ కోసం రూ.20 వేలు డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ కథనం ప్రకారం.. రేగళ్ల పెద్దతండాకు చెందిన భూక్యా లక్ష్మా విద్యుత్ మీటర్ కోసం ఎన్‌వోసీ కావాలని రేగళ్ల పంచాయతీ కార్యదర్శి కాంపాటి పుల్లయ్యకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం కార్యదర్శి రూ.20 వేలు డిమాండ్ చేశాడు. సదరు బాధితుడు అంత డబ్బు ఇవ్వలేనని చెప్పి అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారు పన్నిన పథకం ప్రకారం.. బాధితుడు లక్ష్మా కార్యదర్శిని మళ్లీ కలవడంతో డబ్బులు డిమాండ్ చేయగా.. అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. కార్యదర్శిని అరెస్ట్ చేసి తీసుకెళ్లారు.

ఏసీబీ అధికారులకు పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య

భద్రాద్రికి చేరుకున్న శ్రీరామ యంత్రం

భద్రాచలం, నవంబర్ 5 : కంచిపీఠం ఆధ్వర్యంలో ప్రత్యేక రథంలో అయోధ్యకు తరలుతున్న శ్రీరామ యంత్రం మంగళవారం భద్రాచలం చేరుకోవడంతో ఆలయ సంప్రదాయం ప్రకారం మేళతాళాల నడుమ యంత్రాన్ని సీతారామచంద్రస్వామివారి వద్ద ఉంచి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తర్వాత శ్రీరామ యంత్రాన్ని ఆలయ ఈవో ఆలయ సంప్రదాయ పద్ధతిలో తిరిగి రథం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవోతోపాటు అర్చకులు, ఈఈ రవీందర్, ఏవో భవానీకృష్ణ, సూపరింటెండెంట్ సాయిబాబా, కంచిపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

పూజల అనంతరం శ్రీరామ యంత్రంతో రథం వద్దకు వస్తున్న ఆలయ ఈవో, అర్చకులు